ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 2 ఏప్రిల్ 2025

ఆర్టీసీ ద్వారా భద్రాచలం ముత్యాల తలంబ్రాలు

పెద్దపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఈ నెల 6న జరగనున్న సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకొని అక్కడకు వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ కార్గో ద్వారా సీతారాముల కల్యాణ ముత్యాల తలంబ్రాలను ఇంటి వద్దకే పంపించే ఏర్పాటు చేసిందని కరీంనగర్ రీజియన్ లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల నుంచి గోటితో ఒలిచిన ప్రత్యేక తలంబ్రాలతోపాటు రెండు ముత్యాలు అందిస్తామన్నారు. ముత్యాల తలంబ్రాల కోసం ఒక్కొక్క ప్యాకెట్‌కు 151 రూపాయలు ఆన్‌లైన్ ద్వారా, అన్ని బస్టాండ్ కార్గో సెంటర్లు, ఏజెంట్ కౌంటర్ల వద్ద బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు కరీంనగర్ రీజియన్ పరిధిలో 6 వేల మంది భక్తులు ముత్యాల తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఇంకా తలంబ్రాలు కావాల్సిన భక్తులు ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9154298554 ఫోన్‌లో సంప్రదించాలని ఏటీఎం రామారావు కోరారు.

కమిషనరేట్‌లో 9మంది సిబ్బంది బదిలీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో 9మంది సిబ్బందిని బదిలీ చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. అంతర్గాం హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రావు పొత్కపల్లికి, టుటౌన్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కాల్వ శ్రీరాంపూర్, గోదావరిఖని వన్‌టౌన్ కానిస్టేబుళ్లు తీట్ల శ్రీనివాస్ జూలపల్లి, రవిని పొత్కపల్లికి బదిలీ చేశారు. 9మందిని ఆకస్మాత్తుగా బదిలీ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశం అయ్యింది.

- ఆర్టీసీలో నగదు రహిత సేవల విస్తరణ
- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనూ ఈ-టిమ్‌ల వినియోగం
- కరీంనగర్ రీజియన్‌కు 745 టిమ్‌ల రాక
- ప్రయోగాత్మకంగా కొన్ని ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆరంభం



ప్రయాణికులకు తప్పనున్న చిల్లర తిప్పలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు ప్రయాణికులకు ఇక నుంచి చిల్లర తిప్పలు తప్పనున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత సేవలను క్రమంగా అన్ని సర్వీసులకు విస్తరిస్తున్నారు. ఇప్పటి వరకు డీలక్స్ సర్వీస్ నుంచి సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి స్లీపర్, లహరి ఏసీ స్లీపర్, గరుడ సర్వీసుల్లో కొనసాగించిన ఈ-టిమ్‌లను ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సర్వీసుల్లోనూ విస్తరిస్తున్నారు. కరీంనగర్ ఆర్టీసీ రీజియన్‌కు 745 ఈ-టిమ్ యంత్రా లు వచ్చాయి. ఈ యంత్రాలు ఇప్పటి వరకు వినియో గిస్తున్న వాటి కంటే అధునాతనమైనవి పేర్కొ న్నారు. పాత టిమ్‌ల స్థానంలో కొత్తగా వచ్చిన వాటిని ఐదు రోజుల నుంచి వినియోగిస్తున్నారు. రీజియన్ పరిధిలోని పెద్దపల్లి జిల్లా గోదావరిఖని, మంథని ఆర్టీసీ డిపోలతో పాటు కరీంనగర్ 1, కరీంనగర్ 2, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, హుజూరాబాద్, హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల డిపోల్లో మంగళవారం నుంచి కొన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీస్ బస్సుల్లో ఈ-టిమ్ యంత్రాలను వినియోగిస్తున్నారు.

● తీరనున్న చిల్లర సమస్య

కరోనా ముందు నుంచే డిజిటల్ ప్లాట్ ఫామ్‌ల ద్వారా నగదు రహిత సేవలు ఆరంభం కాగా, కరోనా అనంతరం వాటి సేవలు మరింత విస్తరించాయి. ఒకప్పుడు నగదు డబ్బుల కోసం బ్యాంకులకు వెళ్లి లైన్‌లో నిలబడి ఓచర్ రాసి డబ్బులు డ్రా చేసుకునే వాళ్లం. ఆ తర్వాత ఏటీఎం కార్డులు వచ్చాయి. స్మార్ట్ ఫోన్ల సంఖ్య పెరగడంతో వాటిలోకి గూగుల్‌పే, ఫోన్‌పే లాంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని త ద్వారా నగదు రహిత లావాదేవీలను కొనసాగిస్తున్నా రు. ప్రతీ ఒక్కరు నగదు రహిత లావాదేవీలకు అలవాటుపడ్డారు. కూరగా యలు అమ్మే వారి నుంచి మొదలుకుని అన్ని రకాల వ్యాపారాలు చేసేవాళ్లు వినియోగదారుల కోసం నగదు రహిత సేవల కోసం స్కానర్లను వాడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లోని డీలక్స్ ఆపై సర్వీసుల్లో గతేడాది క్రితం నుంచే నగదు రహిత సేవలను వినియోగిస్తున్నారు.

● మహాలక్ష్మి పథకంతో చిల్లర సమస్య..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలు రాష్ట్రమంతటా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించింది. ఈ పథకంతో ఆర్టీసీలో ఓఆర్ శాతం పెరిగింది. దీంతో బస్సుల సంఖ్య కూడా పెరిగింది. బస్సుల్లో ప్రయాణిస్తున్న వారిలో పురుషుల నుంచే మాత్రమే టిక్కెట్లు ఇచ్చి నగదు తీసుకోవాల్సి వస్తున్నది. బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య పురుషుల కంటే మహిళల సంఖ్యే ఎక్కువగా ఉంటున్నది. దీంతో కండక్టర్లకు చిల్లర సమస్య తలెత్తింది. చాలా మంది వంద, 200, 500 రూపాయల నోట్లు తీసుక వస్తుండడంతో కండక్టర్లు

(మిగతా 8వ పేజీలో)

క్రమంగా నగదు రహిత సేవల విస్తరణ..

- రాజు, ఆర్టీసీ రీజినల్ మేనేజర్



ఆర్టీసీలోని అన్ని సర్వీసుల్లో నగదు రహిత సేవలను విస్తరిస్తున్నారు. కొత్తగా వచ్చిన ఈ-టిమ్‌లను ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సర్వీసుల్లోనూ వినియోగిస్తాం. ప్రయో గాత్మకంగా కొన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వినియోగిస్తు న్నాం. తద్వారా సాంకేతిక ఇబ్బందులను గమనించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుక వెళతాం. లగ్జరీ, ఇతర సర్వీసుల్లో కొత్త యంత్రాల్లో సీటు లాకింగ్ సిస్టం పై అధికారులు సవరించనున్నారు. ఈ-టిమ్‌ల వినియోగంపై కండక్లర్లకు అవగాహన కల్పిస్తాం.

రామగుండం కార్పొరేషన్‌లో 72.5శాతం పన్నుల వసూళ్లు

● 15వ ఆర్థిక సంఘం ఫర్ఫార్మెన్స్ గ్రాంట్‌కు అర్హత



కోల్‌సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం 72.5శాతం ఆస్తి పన్ను వసూలు చేసింది. గతేడాది 55.58శాతం వసూలు కాగా ఈ ఏడాది 72.5 శాతం వసూలైంది. కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు ఆస్తి పన్ను వసూలు ఆధారంగా 15వ ఆర్థిక సంఘం పర్ఫార్మెన్స్ గ్రాంట్ ఇస్తుంది. రామగుండం కార్పొరేషన్ 72.5శాతం వసూలు చేయడంతో ఈ గ్రాంట్‌కు అర్హత సాధించింది. కార్పొరేషన్ పన్నుల వసూళ్లపై కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక దృష్టి పెట్టారు. సాధారణ పన్నుల వసూళ్లు పెంచితేనే వేతనాలు, మెయింటనెన్స్ సాధ్యమవుతుందని మొదటి నుంచి రెవెన్యూ విభాగానికి టార్గెట్ పెట్టుకుంటూ వచ్చారు. టార్గెట్ పూర్తయితేనే వేతనాలు చెల్లిస్తామంటూ షరతులు పెట్టారు. ఈ పరిస్థితుల్లో గ్రూప్-4 నియామకాలతో కార్పొరేషన్‌కు వార్డు ఆఫీసర్లు, జూనియర్ అసిస్టెంట్లు అదనంగా రావడంతో డివిజన్ల వారీగా వార్డు ఆఫీసర్లను కేటాయించి వారికి పారిశుధ్యం, ఇతర విభాగాల్లో ఉన్న సిబ్బందిని సహాయకులుగా కేటాయించారు. ఫిబ్రవరి నుంచి కమిషనర్ అరుణశ్రీ నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వడ్డీపై 90శాతం మాఫీ ఇవ్వడంతో రెవెన్యూ సిబ్బంది మొండి బకాయిలపై దృష్టి పెట్టి వసూళ్లను పెంచాయి. దీంతో ఈ ఏడాది పన్నుల వసూళ్లు పెరిగాయి.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మంథనిరూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గద్దలపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సిరిపురంలో వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో బయటకు వెళ్ళాలని, తలకు రుమాలు, గొడుగులతో నీడ వుండేలా చూసుకోవాలన్నారు. ఓఆర్‌ఎస్, నిమ్మరసం, ఉప్పు, చెక్కర కలిపిన నీటిని తాగాలన్నారు. వడదెబ్బ తగిలిన వారు సొమ్మసిల్లి పోవడం, తలనొప్పి, జ్వరం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు ఉంటే డాక్టర్ సలహాలు తీసుకోవాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ శ్రీజ, ఏఎన్‌ఎం వీరమ్మ, పాల్గొన్నారు.

సాహిత్యం మానవీయ విలువలను ప్రతిబింబిస్తుంది

● అలరించిన ఉగాది కవి సమ్మేళనం



ఉగాది కవిసమ్మేళనంలో మాట్లాడుతున్న ఉదయసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సాహిత్యం మానవీయ విలువలను ప్రతిబింబిస్తుందని ఉదయ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటీ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఉదయసాహితీ, జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది కవిసమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో కోల్‌బెల్ట్ సాహిత్యం గ్రామీణ జీవితానికి నిలువుటద్దంగా నిలిపితే, జానపద, ఉద్యమ సాహిత్యం జిల్లాలో పెద్ద ఎత్తున వచ్చిందన్నారు. అల్లం రాజయ్య, కాల్వ మల్లయ్య, ఆడెపు లక్ష్మయ్య, బుడిగ శంకర్, వేల్పుల నారాయణ జిల్లాలో సాహితీవేత్తలు ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న సాహితీవేత్తలు తమ కవితగానం చేశారు. అనంతరం వారికి వేదిక తరపున సర్టిఫికెట్ అందజేసి సన్మానించారు. జిల్లా రచయితల సంఘం కన్వీనర్ ఏలేశ్వరం వెంకటేశం, కోకన్వీనర్ బుర్ర తిరుపతి, బహుజన సాహితీ వేదిక నాయకులు బాలసాని కొమురయ్య, యువకవి తడిగొప్పల కుమారస్వామి, నూనె రాజేశం, అనాసి జ్యోతి, బొమ్మినేని రాజేశ్వరి, ఎం.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 11.94లక్షల టన్నుల
యూరియా ఉత్పత్తి 7
● లక్ష్యానికి చేరువైన పరిశ్రమ ● రూ.510కోట్ల వార్షిక లాభాల అంచనా...
● ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స...

స్వశక్తి మహిళలకు
టైలరింగ్‌పై శిక్షణ.. 6
● స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు కృషి
● జిల్లా వ్యాప్తంగా మూడు కేంద్రాలలో శిక్షణ
● 13 గ్రామీణ మండలాల సంఘాల, అర్బన్ మహిళా సంఘాలకు ప్రాతినిధ్యం
● స్వశక్తి సంఘాల మహిళలకే స్కూల్ యూనిఫాం ఆర్డర్స్

శివ్వారం బ్రిడ్జితో ప్రయోజనం లేదు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మంథని-శివ్వారం మధ్య నిర్మించ తలపెట్టిన బ్రిడ్జితో నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. మంగళవారం మంథని తీరంలో బ్రిడ్జి నిర్మాణ స్థలంలో పుట్ట మధు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే బంధువర్గ ప్రయోజనాల కోసమే రూ.300 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. మున్సిపాల్సిటీ పరిధిలోని కూచిరాజ్‌పల్లిలో ఎమ్మెల్యే బంధువైన సీఎల్ రాజంకు 50 ఎకరాల భూములున్నాయని, రియల్ ఎస్టేట్‌లో వాటి ధరలు పెంచడానికి ఈబ్రిడ్జి నిర్మాణం చేపట్టారన్నారు. ఈబ్రిడ్జి రోడ్ కూచిరాజ్‌పల్లి వద్దనే ప్రధాన రహదారికి కలుస్తుందన్నారు. ఎక్కడ హైవేకు కనెక్ట్ లేదన్నారు. తమ ప్రభుత్వంలోనే కేసీఆర్ సిరిపురం వద్ద నదిపై బ్రిడ్జి నిర్మించడంతో మంచిర్యాల, చెన్నూరు ప్రాంతాలకు రాకపోకలు కొనసాగుతున్నాయన్నారు. ఈప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి ఆరెంద వద్ద మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణానికి ఆరేళ్ళ క్రితమే ప్రతిపాదనలు చేశామన్నారు. అడవిసోమన్‌పల్లి వద్ద నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందన్నారు. బోయినిపేట, గొల్లగూడెం, కూచిరాజ్‌పల్లి వాసులకు మేలు కలిగే విధంగా రింగ్ రోడ్, ఆరెంద వద్ద బ్రిడ్జిని నిర్మించాలన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, శంకర్‌లాల్, గొబ్బూరి వంశీ, జంజర్ల శేఖర్, వేల్పుల గట్టయ్య, కనవేన శ్రీనివాస్, ఆసీఫ్, సమ్మయ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ భవనం పరిశీలన



పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

ఎలిగేడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పోలీస్ స్టేషన్ భవనాన్ని డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణలు పరిశీలించారు. 2021 జూన్ 1న అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం ఎలిగేడును మండలంగా ప్రకటించింది. 24ఏళ్లుగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు నోచుకోలేదు. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఇచ్చిన హామీ మేరకు పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కృషిచేశారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణకు మండల కేంద్రంలోని పాత రెవెన్యూ కార్యాలయాన్ని ఎంపికచేశారు. తాత్కాలిక మరమ్మతు చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ప్రారంభం నిలిచిపోయింది. కోడ్ ముగియడంతో ఈ క్రమంలో డీసీపీ, ఏసీపీలు పరిశీలించారు. కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని డీసీపీ అధికారులకు సూచించారు. సీఐ సుబ్బారెడ్డి, జూలపల్లి ఎస్సై కరుణాకర్ పాల్గొన్నారు.

దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులను ఆపాలి



నిరసన తెలుపుతున్న ఆదివాసీల హక్కుల పోరాట వేదిక సభ్యులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై దాడులు ఆపాలని మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట వేదిక కన్వీనర్‌లు ముడిమడుగుల మల్లన్న, జిన్నా ప్రసాద్, గుమ్మడి కొమురయ్య, తాళ్లపల్లి లక్ష్మణ్, రామిళ్ల బాపు శ్రీపతి రాజగోపాల్ మాట్లాడుతూ ఆదివాసీలకు అన్ని ప్రతిపక్ష పార్టీలు, వామపక్ష, పౌర, ప్రజాస్వామిక వర్గాల ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అడవులలోని కొల్లాది సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఆదివాసీలకు అన్ని వర్గాల ప్రజలు, దళితులు, మేధావులు, హక్కుల కార్యకర్తలు అండగా ఉండాలని కోరారు. జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న, బాపన్న, సదానందం, మల్లేశం, కొంతం రాజు, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు



విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సోని

మంథని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో మరిన్ని మెరుగైన స్త్రీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ బీ.సోని స్త్రీ వైద్య నిపుణురాలిగా కాంట్రాక్టు పద్ధతిలో నియమించినట్లు తెలిపారు. గర్భిణీలకు అవసరమైన సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

కుప్పకూలిన రియల్ ఎస్టేట్

- పంట పొలాలుగా మారుతున్న వెంచర్లు
- ఆర్థిక ఇబ్బందుల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు



రియల్ ఎస్టేట్ వెంచర్ వద్ద పంటపొలం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలింది. జిల్లా ఏర్పడిన తరువాత అంచెలంచెలుగా ఎదిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం క్రమంగా తగ్గుతూ వచ్చింది. రెండు మూడేళ్ళుగా అమ్మకాలు, కొనుగోళ్ళు లేక రియల్ వ్యాపారులు కుదేలవుతున్నారు. పెట్టిన పెట్టుబడులు నిలిచిపోవడంతో అప్పుల పాలవుతున్నారు. మధ్యవర్తులకు ఉపాధి లేకుండా పోయింది.

జిల్లాలో పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, గోదావరిఖని, సెంటినరి కాలనీల్లో వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి వెంచర్లుగా ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. జిల్లాగా ఏర్పడిన అనంతరం కొన్నేళ్ళు వ్యాపారం ఊపందుకుంది. మూడు వెంచర్లు ఆరు ప్లాట్లుగా కొనసాగిన వ్యాపారం ఒక్కసారిగా నిలిచి పోయింది. అమ్మకాల కోసం ఎదురు చూసిన వ్యాపారులు వెంచర్లను తిరిగి పొలాలుగా మార్చారు.

భూయజమాని దగ్గర ధర కుదుర్చుకొని బయానాగా కొంత చెల్లించి వెంచర్ పనులు ప్రారంభిస్తారు. మిగితా డబ్బులు వాయిదాలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంటారు. పెద్దపల్లి జిల్లాగా ఏర్పడిన తరువాత మూడు నాలుగేళ్ళ పాటు రియల్ వ్యాపారం జోరుగా కొనసాగింది. అనంతరం వ్యాపారం పూర్తిగా నిలిచిపోయింది. ఈక్రమంలో ప్లాట్లు అమ్ముడుపోక వాయిదాలు చెల్లించలేక భూయజమానులతో వివాదాలు తలెత్తి పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టు తిరుగుతున్నారు. కొందరు అప్పులు తెచ్చి వాయిదాలు చెల్లించినప్పటికి వడ్డీలు పేరుకపోయి ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు విలాసవంతమైన జీవితం గడిపిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు దిగజారిపోయారు. జిల్లాలో రియల్ వ్యాపారంపై ఆధారపడి సుమారు 8 వందల నుంచి వెయ్యి మంది వరకు ఆధారపడ్డారు. కొనుగోలుదారులను మభ్యపెట్టి, నచ్చజెప్పి ప్లాట్లు విక్రయించి కమీషన్ తీసుకునే వారు. ఇప్పుడు వారికి ఉపాధి లేకుండా పోయింది. ఒక్కొక్క బ్రోకర్ వద్ద పదుల సంఖ్యలో ప్లాట్లు అమ్మకానికి ఉన్నాయి. కొనే వారు లేక కుటుంబాలు గడపడం కష్టంగా మారింది. బ్రోకర్ల వద్ద అమ్మకానికి ఉన్న ప్లాట్లకు ధర పలుకడం లేదు. కొనుగోలు చేసిందాని కంటే తక్కువ ధరకు అమ్ముకుందామన్న కొనేవారు లేరు. భూమిపై పెట్టుబడిపెడితే నష్టపోమనే నమ్మకం పోయింది. పెళ్ళిళ్ళు తదితర అవసరాలకు విక్రయం జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

కారణాలు ఇవే : ధరలు పెరగడంతో సామాన్యుడు ప్లాట్లు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజలు అధికంగా పెంచడం మరో కారణంగా చెప్పు కోవచ్చు, కరోనా కాలం నాటి కరువు ఇంకా కొనసాగుతోంది. మార్కెట్లో డబ్బుల లావాదేవీలు లేకపోవడం, అప్పటి అప్పులు ఇంకా తీరలేదని తెలుస్తోంది.

ఆర్థికంగా ఇబ్బందులు...

-పెగడ రమేష్, రియల్ ఎస్టేట్ సంఘం జిల్లా అధ్యక్షుడు



రైతులు తమ భూములను అధిక ధరకు మాకు విక్రయించడం వల్ల మేం కష్టమర్ల మీద భారం వేయాల్సి వస్తోంది. దీంతో కొనుగోళ్ళు జరుగడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

కుటుంబం గడపవడం కష్టంగా ఉంది

- మెరుగు చందర్ రియల్ ఎస్టేట్ బ్రోకర్



భూములు, ప్లాట్ల క్రయవిక్రయాలతో వచ్చే కమీషన్‌తో కుటుంబం గడిచేది. ప్రస్తుతం కొనే వారే కరువయ్యారు. జిరాక్స్ సెంటర్ పెట్టుకొని ఉపాధి పొందుతున్నా.

వివాహం కావడం లేదని ఆత్మహత్య


లింగమూర్తి (ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వయస్సు మీరుతున్నా వివాహం కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పూసాలకు చెందిన నల్ల లింగమూర్తి (39) పెద్దపల్లిలోని ఫైనాన్స్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. వివాహం కావడం లేదని కొన్ని రోజులుగా మనస్తాపంతో ఉంటున్నాడు. ఆదివారం ఉగాది రోజు రాత్రి మనస్తాపంతో ఎలుకల మందు తాగగా కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. సోదరుడు రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

● ఒకరికి తీవ్ర గాయాలు

చందుర్తి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామ శివారులో ఆటోను ద్విచక్రవాహనం మంగళవారం ఢీకొన్న సంఘటనలో ఆటోలో కూర్చున్న వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లు ద్విచక్ర వాహనంపై బండపల్లి నుంచి వేములవాడ వైపు వెళ్తున్నారు. వేములవాడ నుంచి బావుసాయిపేట గ్రామం వైపు వస్తున్న ఆటోను ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన గెంటే ప్రశాంత్‌కు తీవ్రగాయాలై, కాలు విరిగింది. గ్రామస్థులు బాధితుడిని చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చందుర్తి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం సనుగుల గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం చందుర్తికి చెందిన కోన నరేష్, మల్యాల గ్రామానికి చెందిన నర్సయ్య అనే ఇద్దరు వ్యక్తులు కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా సనుగుల శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. ఒకరికి కాలు విరగగా, మరొకరికి తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బాకీ డబ్బుల వివాదం

● ఒకరి ఆత్మహత్యాయత్నం

చందుర్తి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బాకీ డబ్బులు చెల్లించడం లేదని అవమానించారని ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన చందుర్తి మండలం బండపల్లిలో చోటు చేసుకుంది. చందుర్తి ఎస్సై అంజయ్య, గ్రామస్థుల కథనం ప్రకారం వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి చెందిన బోదాసు రాజు అనే వ్యక్తి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శివరాత్రి దేవయ్య, దండుగుల నరేష్‌ల వద్ద రెండు తులాల బంగారం అప్పుగా తెచ్చుకున్నాడు. ఏడేళ్ల క్రితం జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లి వచ్చిన తరువాత రెండు తులాల బంగారం ఇచ్చాడు. ఒప్పంద పత్రం ప్రకారం మరో తులం బోదాసు రాజు బాకీ ఉన్నాడు. బోదాసు రాజు జీవనోపాధి కోసం చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. బోదాసు రాజు వద్దకు మంగళవారం ముగ్గురు వ్యక్తులు వచ్చి మిగిలిన తులం బంగారం డబ్బులు అడిగారు. దీంతో వారి మధ్య మాట మాట పెరిగింది. వచ్చిన వ్యక్తులు అవమానకరంగా మాట్లాడటంతో మనస్థాపానికి గురైన రాజు అక్కడే ఉన్న పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. రాజు భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శివరాత్రి దేవయ్య, దండుగుల నరేష్, దండుగుల రాజవ్వలపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై అంజయ్య పేర్కొన్నారు.

పారిశుధ్యంపై పట్టింపేదీ?

● డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త ● దుర్వాసనతో అవస్థలు

మల్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మల్యాల మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుధ్యంపై పట్టింపు కరువైందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోయి, మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోందని అంటున్నారు. ఎస్సీ కాలనీ సమీపంలో మురుగు కాలువ చివరలో నీరు వెళ్లడానికి తగిన ఏర్పాట్లు చేయకుండా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంకుడు గుంత పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మల్యాలలో డ్రైనేజీలో పేరుకున్న చెత్త


అసంపూర్తిగా వదిలేసిన ఇంకుడు గుంత

స్వశక్తి మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ


సుల్తానాబాద్‌లో కుట్టు శిక్షణ పొందుతున్న స్వశక్తి మహిళలు

● స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు కృషి
● జిల్లా వ్యాప్తంగా మూడు కేంద్రాలలో శిక్షణ కేంద్రాలు...
● 13 గ్రామీణ మండలాల సంఘాలు, అర్బన్ మహిళా సంఘాలకు ప్రాతినిధ్యం
● స్వశక్తి సంఘాల మహిళలకే స్కూల్ యూనిఫాం ఆర్డర్స్

సుల్తానాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో స్వశక్తి మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పిస్తున్నారు. గత నెల 22 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామీణ మండలాలతో పాటు అర్బన్ ప్రాంతాల మహిళలను ఎంపిక చేసి వారికి ఆయా మండల కేంద్రాలలో కుట్టు శిక్షణ, క్లాత్ కటింగ్‌పై నిపుణులను నియమించి శిక్షణ ఇప్పిస్తున్నారు.

ఇందులో భాగంగా సుల్తానాబాద్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాయం ఆవరణలోని ఐకేపీ భవన్‌లో శిక్షణ కేంద్రాన్ని ప్రాంభించారు. సుల్తానాబాద్ గ్రామీణ, అర్బన్ ప్రాంత మహిళలతో పాటు ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ఎలిగేడు, జూలపల్లి తదితర మండలాలకు చెందిన స్వశక్తి మహిళా సంఘాలకు చెందిన వారిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇప్పిస్తున్నారు. వారం పది రోజుల పాటు శిక్షణ కొనసాగుతుంది. అనంతరం కుట్టు శిక్షణ పొందిన మహిళలు మండల కేంద్రాలలో మిగతా సంఘాల మహిళలకు శిక్షణ ఇవ్వాలి. వీరే స్వయంగా మిషన్లను ఏర్పాటు చేసు కోవడమో లేక దాతల సహకారంతో మిషన్లు సమకూ ర్చుకుని శిక్షణ పొందాలి. పూర్తి స్థాయిలో కుట్టు శిక్షణ, క్లాత్ కటింగ్ పై పట్టు సాధించడంతో అప్పుడు ఆయా మండల సమైఖ్య సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యం లోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ, మోడల్ స్కూల్స్ కాలేజీలలో ఉంటున్న విద్యార్థులకు ఆయా స్కూల్స్ సంబంధించిన యూనిఫాం కూడా మహిళా సంఘాల వారికే ప్రభుత్వం ఆర్డర్ ఇస్తారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రైవేట్ వారిచే క్లాత్ కటింగ్ చేయించి ఇవ్వడం లేదా కుట్టి ఇస్తున్నారు. ఇలా చేయడం వలన ఆయా పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు సరిపడడం లేదు. కొందరికీ పొట్టిగా, మరి కొందరికి పొడుగు సమస్యలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం ఈ స్కూల్ యూనిఫాం మొత్తాన్ని పెద్దపల్లి జిల్లాలో మాత్రమే మహిళా సంఘాలకు అప్పగించారు. ఇలా మహిళ సంఘాల వారు ప్రభుత్వ స్కూల్స్‌కు ఇచ్చే ప్రతీ డ్రెస్‌కు కుట్టు కూలీ కింద డెబ్బై ఐదు రూపాయలు చెల్లిస్తుంది.

మూడు కేంద్రాల్లో శిక్షణ

కాళిందిని దేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి

సుల్తానాబాద్, కమాన్ పూర్, ఎన్టీపీసీలలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాలలో మహిళలకు విజయవంతంగా శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని మహిళా సంఘాల వారిచే ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పిల్లలకు స్కూల్ యూనిఫాం కుట్టడం కోసం కలెక్టర్ ప్రత్యేక చొరవతో అదనపు నిధులు మంజూరు చేశారు. జిల్లాలో మూడు చోట్ల శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాలలో జిల్లాలోని 13 గ్రామీణ మండలాలు, అర్బన్ ప్రాంతాలకు చెందిన స్వశక్తి మహిళలకు టైలరింగ్‌లో పూర్తిస్థాయి శిక్షణ ఇప్పిస్తున్నాం. శిక్షణ అనంతరం మహిళలు ప్రభుత్వ స్కూల్స్‌కు చెందిన స్కూల్ యూనిఫాం కుట్టే పనులు స్వీకరించి లబ్ధి పొందుతారు.

ప్రతి మండలం నుంచి ఇరవై మందికి శిక్షణ

ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్



సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో 120 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. వారికి కుట్టు, క్లాత్ కటింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ రెండు అంశాలలో శిక్షణ పూర్తయిన మహిళలు తమ మండల కేంద్రాలలో మిగతా మహిళలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. అందరూ శిక్షణ పొందిన తర్వాత ప్రభుత్వ విద్యా సంస్థలకు సంబంధించిన విద్యార్థుల స్కూల్ యూనిఫాం ఆర్డర్స్ పొంది ఆ దుస్తులను కుట్టి ప్రభుత్వానికి ఇస్తారు. సుల్తానాబాద్ లో శాశ్వతంగా మహిళా సమైఖ్య సంఘం వారికి కుట్టు కేంద్రం నిర్వహించడానికి రెండు రోజుల క్రితమే డీఆర్‌డీఏ తదితరులు నిరుపయోగంగా ఉన్న ఆర్అండ్‌బీ గెస్టుహౌస్‌ను పరిశీలించారు.

శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన డీఆర్‌డీఏ

సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఐకేపీ భవన్‌లో పది రోజులుగా నిర్వహిస్తున్న మహిళల కుట్టు, క్లాత్ కటింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం డీఆర్‌డీఏ కాలిందినీ దేవి పరిశీలించారు. ఆరు మండలాలకు చెందిన 120 మంది స్వశక్తి మహిళా సంఘాలకు చెందిన వారు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. జిల్లాలోని మూడు కేంద్రాలలో పది రోజుల శిక్షణ ముగిసిన అనంతరం అన్ని మండలాల్లో మహళా స్వశక్తి సంఘాల వారికి శిక్షణా కేంద్రాలను ఈ నెల 5వ తేదీలోగా ప్రారంభించనున్నట్లు డీఆర్‌డీఏ కాలిందినీ దేవి తెలిపారు. మండల కేంద్రాలలో అనువైన భవనాలను ఎంపిక చేస్తున్నామన్నారు. సుల్తానాబాద్‌లో శిక్షణ కేంద్రాన్ని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసేందుకు మంగళవారం పరిశీలించామన్నారు.

జిల్లాలో 86 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఈ వ్యవసాయ సీజన్‌కు సంబంధించి జిల్లాలో తమ శాఖ ద్వారా 86 కేంద్రాలలో ధాన్యం కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్‌డీఏ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రాలను ఎంపిక చేసి ప్రారంభి స్తామని ఇప్పటి వరకు 86 కేంద్రాలలో ఏర్పాట్లు పరిశీలించామన్నారు.


సుల్తానాబాద్‌లో కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ కాళిందిని దేవి

బీసీలకు 42శాతం రిజర్వేషన్‌పై చిత్తశుద్ధి లేదు

● పొలాడి రామారావు

హుజూరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కులగణన ఆధారంగా బీసీల 42శాతం రిజర్వేషన్‌పై పాలించే పాలకులకు చిత్తశుద్ధి లేదని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీలో 42శాతం రిజర్వేషన్ ప్రభుత్వం కల్పించడం అభినందనీయమన్నారు. బీసీల రిజర్వేషన్‌పై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో అమోదించిన బిల్లును రాష్ట్ర గవర్నర్‌తో అమోదించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. 42శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఢిల్లీ వేదికగా చేస్తున్న దీక్ష అఖిల పక్ష నాయకులతో కలిసి చేస్తే బాగుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని బీసీలకు చట్టం కల్పించాలన్నారు.

మరమగ్గాల కార్మికుల నిరవధిక సమ్మె

● సిరిసిల్లలో ర్యాలీ.. నేతన్న విగ్రహం ఎదుట నిరసన


సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న కార్మికులు,నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిన చీరలను తయారుచేస్తున్న కార్మికులకు మెరుగైన కూలి నిర్ణయించాలంటూ సిరిసిల్లలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో మరమగ్గాల కార్మికులు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. దీనిలో భాగంగా బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనం నుంచి మరమగ్గాలతోపాటు అనుబంధ రంగాల కార్మికులు భారీ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నేతన్న విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణలు మాట్లాడారు. కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మెను కొసాగిస్తామన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులతో భారీ ధర్నాను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, నాయకులు గుండు రమేష్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, నాయకులు కుడిక్యాల కనుకయ్య, ఒగ్గు గణేష్, ఉడుత రవి, సబ్బని చంద్రకాంత్, ఎక్కల్‌దేవి జగదీష్, బెజుగం సురేష్, భాన శ్రీధర్, శ్రీకాంత్, సదానందం, రవీందర్, రాజమల్లు, వేణు, శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గంగాధర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కురిక్యాల శివారులో విద్యుదాఘాతంతో రైతు మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కురిక్యాల గ్రామానికి చెందిన ఒగ్గరి ప్రశాంత్(40) తనకున్న మూడరెకరాలతో పాటు మరో మూడెకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. రోజువారి మాదిరిగానే మంగళ వారం ఉదయం పొలానికి నీరుపెట్టడానికి వెళ్లి కరెంటు స్టాటర్ డబ్బాను ముట్టుకోగానే విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పక్కన ఉన్న రైతు గమనించి బంధువులు సహాయంతో కరీంనగర్ తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జగిత్యాలరూరల్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి శరీరంపై బ్రౌన్ కలర్ ఫార్మల్ పాయింట్, మెరూన్ నలుపురంగు పొడవు గీతలు గల ఫుల్‌హ్యాండ్ చొక్కా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసినవాళ్లు జగిత్యాల రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని వారు కోరారు.

యువతి బలవన్మరణం

గొల్లపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఎనగందుల జయంతి (25) అనే యువతి కడుపు నొప్పి భరించలేక మంగళవారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు జయంతి డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. కొంతకాలంగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతోంది. దీనికి తోడు కుటుంబ ఆర్థిక పరిస్థితులతో జీవితం మీద విరక్తి చెంది తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో ఉరేసుకొని బలవన్మరణం చెందింది. తల్లి ఎనగందుల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

ధర్మపురి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన సంకు భూలక్ష్మి(55) అనే మహిళ మంగళవారం అదృశ్యమైంది. భూలక్ష్మి ధర్మపురి పట్టణంలో ఇళ్లలో పని చేస్తూ జీవనం సాగిస్తుంది. రోజు మాదిగానే పనికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె కూతురు భూదారపు గంగా జమున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాములోరి తలంబ్రాల బుకింగ్‌లో ఉమ్మడి జిల్లా ముందంజ


మాట్లాడుతున్న లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు

భగత్‌నగర్/కోరుట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రాములోరి తలంబ్రాల బుకింగ్‌లో ఉమ్మడి జిల్లా ముందు వరసలో ఉందని కరీంనగర్ రీజియన్ లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన జరగనున్న భద్రాది రాములోరి కల్యాణానికి వెళ్లలేనివారి కోసం ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్దకే తలంబ్రాలు కార్యక్రమం చేపట్టామన్నారు. ఆరు నెలలుగా నిర్వహిస్తున్న కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6000 మంది ముత్యాల తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకున్నట్లు చెప్పారు. ఒక్కో ప్యాకెట్‌కు ధర 151 రూపాయలు ఉంటుందని, బస్టాండ్ కార్గో సెంటర్, ఏజెంట్ కౌంటర్ల వద్ద బుక్ చేసుకోవచ్చని వెల్లడించారు. అవసరమున్నవారు కింది నంబర్లను సంప్రదించాలని సూచించారు.

● ఉమ్మడి జిల్లా పరిధిలో..

కరీంనగర్ ఆర్ఎంఈ	9154298581
కరీంనగర్	9154298561
గోదావరిఖని	9154298554
హుస్నాబాద్	9154298673
హుజూరాబాద్	9154298559
మంథని	9154298554
జగిత్యాల	7780250439
కోరుట్ల	9154298572
మెట్‌పల్లి	9154298574
సిరిసిల్ల	9154298576
వేములవాడ	9154298574

చోరీ కేసులో నిందితుల అరెస్టు


స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, బైక్‌లు

బోయినపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొదురుపాక గ్రామంలో నాలుగు రోజుల క్రితం జరిగిన చోరీని పోలీసులు ఛేధించి నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బోయినపల్లి ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. వివరాల ప్రకారం.. కొదురుపాక గ్రామానికి చెందిన సట్టా జలజ ఇంట్లో గత నెల 28న ఇంట్లో బంగారం వెండి ఆభరణాలు గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో వేములవాడ ఏసీపీ శేషాద్రిరెడ్డి దొంగలను పట్టుకునేందుకు వేములవాడ రూరల్ సీఐ, బోయినపల్లి ఎస్సై ఇద్దరిని కలిపి రెండు టీంలుగా ఏర్పాటు చేశారు. టెక్నికల్ ఎవిడెన్స్, సీసీఫుటేజ్ ఆధారంగా కరీంనగర్‌కు చెందిన ఇద్దరు మైనర్‌లతో పాటు భార్యాభర్తలను మొత్తం నలుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి నాలుగున్నర తులాల బంగార, రెండు జతల పట్ట గొలుసులు రికవరీ చేశారు. అంతే కాకుండా వీటితో పాటు ఈ నలుగురు దొంగలు కరీంనగర్‌లో ఒక బైకు వేములవాడలో ఒక బైకు దొంగతనం చేసినట్లు విచారణలో వారు వెల్లడించారు.

వెంకట్రావుపల్లి గ్రామంలో వెల్డింగ్ షాప్‌లో ఒక మిషన్ దొంగతనం చేసినట్లు విచారణలో చెప్పగా వీరి వద్ద నుంచి రెండు బైకులు, వెల్డింగ్ షాప్‌లోని మిషను రికవరీ చేసారు.

దొంగలను పట్టుకోవడంలో చురుకుగా వ్యవహరిం చిన వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌తో పాటు ఎస్సై పృథ్వీధర్ గౌడ్, కానిస్టేబుల్స్ తిరుపతి, కోటేశ్వరరావులను ఏసీపీ అభినందించారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం


కొత్తపల్లిలో పంటలను పరిశీలిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నీరు అందక పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ కిసాన్ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి అన్నారు. మంగళవారం కొత్తపల్లిలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతలకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారన్నారు. డి-93 కాలువ ద్వారా పంట పొలాలకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. చివరి ఆయకట్టు గ్రామాల పొలాలకు నీరు అందక వందల ఎకరాలు నష్టపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డి-93 కాలువకు సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మాజీ ఎంపిపి వాసాల రమేష్, మాజీ బీజేపీ పట్టణ అధ్యక్షుడు శేఖర్, లక్ష్మారెడ్డి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, మహేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సంపత్, బోనాల మోహన్, చిట్యాల శ్రీనివాస్, వేముల చంద్రశేఖర్, రవిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వీరహనుమాన్ విజయ యాత్ర


పెద్దపల్లిలో వీరహనుమాన్ విజయయాత్ర

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కౌరవులు వందమంది ఉన్నప్పటికీ వారి అహంకారం వల్ల కేవలం అయిదుగురు ఉన్నపాండవుల చేతిలో ఓడిపోయారని, హిందూధర్మ ద్రోహులకు సైతం అదే గతి పడుతుందని పీఠాధిపతి శాంతానందస్వామి అన్నారు. విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన వీరహనుమాన్ విజయయాత్రలో మాట్లాడారు. ధర్మరక్షణకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. విశ్వవ్యాప్తంగా సనాతన హిందూ ధర్మం వేగంగా విస్తరిస్తోందని, బలమైన ప్రాచీన మూలాలే ఇందుకు కారణమని పేర్కొన్నారు. హిందూ ధర్మాన్ని మరిన్ని తరాలకు అందించేలా తమ కార్యాచరణ ఉండబోతుందన్నారు.

కాషాయమయమైన పట్టణం

బజరంగదళ్ చేపట్టిన వీరహనుమాన్ విజయయాత్ర విజయవంతమైంది. పట్టణం కాషాయవర్ణంగా మారింది. శోభాయాత్ర సందర్భంగా హనుమంతుడి ఉత్సవ మూర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు స్వరూప్ కిరణ్ గౌడ్, కార్యదర్శి నాగులమల్యాల సత్యం, రాష్ట్ర నాయకులు అయోధ్య రవి, నగర కార్యదర్శి కొట్టె మహేందర్, బజరంగదళ్ జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్, నగర కన్వీనర్ బోలవేన మణిదీప్ యాదవ్, వేల్పుల రమేష్, సత్సంగ ప్రముఖ్ బొమ్మకంటి రవికుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 11.94 లక్షల టన్నుల

యూరియా ఉత్పత్తి

లక్ష్యానికి చేరువైన పరిశ్రమ

- రూ.510కోట్ల వార్షిక లాభాల అంచనా...
- ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజహన్స...



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టు

కోల్‌సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్) మొదటి సారి ఉత్పత్తి లక్ష్యానికి చేరువైంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 11.94లక్షల యూరియా ఉత్పత్తిని సాధించింది. ఈసారి ఉత్పత్తితో పాటు రవాణాపై కూడా దృష్టి పెట్టింది. 11.95లక్షల టన్నుల యూరియాను రవాణా చేసి 12.45లక్షల టన్నుల పీఓఎస్ సాధించింది. ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి రికార్డు స్థాయిలో 407రేక్‌ల యూరియాను రవాణా చేశారు. రైల్వే ద్వారా 11.05లక్షలు, రోడ్డు మార్గంలో 89,505టన్నుల యూరియా రవాణా జరిగింది.

తెలంగాణను ఆదుకున్న ఆర్‌ఎఫ్‌సీఎల్

ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమలో 11.94లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరుగగా ఒక్క తెలంగాణ రాష్ట్రానికే 4,68,945టన్నులు రవాణా చేశారు. యాసంగి సీజన్‌లో తెలంగాణలో యూరియా కొరత ఏర్పడడంతో యుద్ధ ప్రాతిపదికన వ్యాగన్లు, లారీల ద్వారా వివిధ జిల్లాలకు యూరియా రవాణా జరిగింది. ఏపీకి 1.78లక్షల టన్నులు, కర్ణాటకకు 1.91 లక్షల టన్నులు, తమిళనాడు 1.01లక్షల టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 60,640టన్నులు, మహారాష్ట్రకు 82,986టన్నులు, మధ్య ప్రదేశ్ 1.11లక్షల టన్నులు రవాణా చేశారు.

రూ.510కోట్ల లాభాలు...

ఆర్‌ఎఫ్‌సీఎల్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.510కోట్ల లాభాలు ఆర్జిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది రూ.5,600కోట్ల టోర్నవర్ జరిగింది. గ్యాస్, విద్యుత్ బిల్లులకు సింహభాగం ఉంది. రూ.4300కోట్లు గ్యాస్ బిల్లులకే చెల్లించారు. ఈ ఏడాది రూ.510కోట్ల లాభాలు అంచనా వేస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ పన్నుల చెల్లింపుల తరువాత లాభాలు రూ.420 నుంచి రూ.430కోట్లు ఉంటాయని అంచనా వేస్తుంది.

పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు

ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స...



దేశీయ వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు మేకిన్ ఇండియాలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను నిర్మించిం దని, ఈ ఏడాది 11.95లక్షల టన్నుల వేపపూతతో కూడిన యూరియాను రైతాంగానికి సరఫరా చేశామన్నారు. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలకు తగినంత యూరియా అందించడంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ కీలక పాత్రపోషిస్తుందని, భవిష్యత్‌లో కర్మాగారం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేలా కేంద్రం యోచిస్తున్నట్టు రాజహన్స పేర్కొన్నారు.

నయనం ప్రధానం

- విద్యార్థుల్లో పెరుగుతున్న కంటి సమస్యలు
- రక్షణ చర్యలు అవసరం



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఒక్క క్షణం వెలుతురు లేకుండా చీకట్లో ఉండలేము. వెలుగులు జీవితానికి కళ్లు వారధిగా నిలుస్తాయి. సర్వేంద్రియాల్లో కళ్లే ప్రధానం. శరీర భాగంలో కన్ను ఎంతో ముఖ్యమైనది. అందుకే శరీర నిర్మాణంలో కూడా సరైన రక్షణ చర్యలు ఉన్నాయి. మనకు బయటకు కనిపించే కన్ను ఐదు రెట్లు భాగం పుర్రె లోపలనే ఉంటుంది. బయటకు కనిపంచే కనుగుడ్డును కంటి రెప్పలు కాపాడతాయి. దుమ్ము, ధూళి, అధిక కాంతి, అధిక గాలి వల్ల కన్ను దెబ్బతినకుండా రెప్పలు, వాటికుండే వెంట్రుకలు కాపాడుతుంటాయి. ఏడుపు వచ్చినా, అతిగా సంతోషం వచ్చినా, విపరీతంగా నవ్వు వచ్చినా కంట్లో నీళ్లు వస్తాయి. ఎలాంటి సందర్భాలు లేకపోయినా కన్నీరు నిరంతరం ఉంటుంది. కనుగుడ్డును ఎండిపోకుండా చూసుకుంటుంది. కంటిలో ఉన్న లైసోజైన్ అనబడే పదార్థానికి క్రిమిసంహారక గుణం కూడా ఉంటుంది. ముఖ్యంగా రెటీనా అతి ముఖ్యమైంది. మన ముందున్న వస్తువుల ప్రతిబింబాలు రెటీనాపై తలకిందులుగా పడతాయి.

ఈ సమాచారం కంటి నాడి ద్వారా మెదడులోని వెనుక భాగంలోని దృష్టి కేంద్రానికి చేరుతుంది. కంటి ముందుగల నల్ల గుడ్డులో కార్నియా ఉంటుంది. దాని మీద లెన్స్ ఉంటుంది. మనం చూసిన వస్తువుల ప్రతిబింబాలు ఈ కటకం ద్వారా పోయి రెటీనా అనబడే తెరమీద పడతాయి. రెటీనాలోని రాడ్స్, కోన్స్ అనే కణాలు కాంతికిరణాలను తీసుకుని విద్యుత్ తరంగాలుగా మార్చి మెదడుకు చేరవేస్తాయి. విశ్లేషణ అంతా మెదడులోనే జరుగుతుంది. తలకిందులుగా పడిన బొమ్మ మనకు మామూలుగా కనబడేలా మెదడు చూసుకుంటుంది. కానీ ప్రస్తుతం ఆధునిక యుగంలో అనేక లోపాల వల్ల కంటి చూపులో మార్పులు వస్తున్నాయి. మెదడులోని లోపాలు, గాయాలు, శరీరంలో వచ్చే జబ్బుల వల్ల కళ్లు దెబ్బతింటున్నాయి. రక్తపోటు,డయాబెటీస్, గుండె, మెదడు, మూత్రపిండాల్లో అనేక మార్పులు జరుగుతుంటాయి. వీటి వల్ల కూడా కళ్లు ఇబ్బందులు పడతాయి. ప్రస్తుతం పిల్లల్లో కంటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. టీవీలు, కంప్యూటర్లే శత్రువులుగా మారుతున్నాయి. నాలుగో తరగతి చదివే పిల్లవాడు కూడా భూతద్దాల్లాంటి కళ్లద్దాలు పెట్టుకుని తరగతి గదుల్లో కనిపిస్తున్నారు. నిత్యం కళ్లకు కలిగే నిరంతర శ్రమకు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

విద్యార్థుల్లో దృష్టి లోపం...

ఒకటవ క్లాసు చదువుతున్న పిల్లాడు సైతం అద్దాలతో పాఠశాలకు పరుగులు తీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొన్ని వంశ పారంపర్యంగా వచ్చే సమస్యలు అయితే టీవీలు, వీడియో గేమ్‌లు, ఎక్కువగా చదవడంతో కండ్లపై ఒత్తిడి పెరిగి దృష్టి లోపం సమస్య వస్తోంది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో కంటి సమస్యలను దృష్టి లోపాలను గుర్తించడానికి శిబిరాలు నిర్వహించేవారు. ప్రస్తుతం శిబిరాలు లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థులకు చదివేటప్పుడు కళ్లతోనే ఎక్కువగా పని ఉంటుంది. కళ్లపై ఎక్కువ శ్రమ పడుతుంది. సరైన వెలుతురు లేకున్నా చదివే ప్రయత్నం చేస్తాం. ఈ సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. పుస్తకాన్ని కంటికి 30 సెంటిమీటర్ల దూరం ఉంచి చదవాలని వైద్యులు పేర్కొంటున్నారు. నిటారుగా కూర్చుని చదవడం మంచిది. పడుకుని చదవడం వల్ల కళ్లపై భారం పడుతుంది. కూర్చుని చదువుకోవడమే ఎంతో మంచిది. సరిపడా వెలుతురు ఉన్నప్పుడే చదవాలి. కదులుతున్న కుర్చీలో.. ఊయలలో.. బస్సుల్లో చదివితే కళ్లకు శ్రమ కలుగుతుంది.



టీవీ చూసేటప్పుడు..

టీవీని గంటకు మించి విడవకుండా చూడడం మంచిది కాదు. టీవీ చూస్తున్నప్పుడు శరీరాన్ని పలు రకాల భంగిమల్లో ఉంచడం చాలా మంచిది. వెన్నెముకకు ఆసరా ఉండే కుర్చీల్లో కూర్చొని టీవీ చూడడం కంటికి మేలు చేస్తుంది. చీకటి ఉన్న గదిలో కూర్చుని టీవీ చూడడం మంచిది కాదు. సరిపడా వెలుతురు ఉండాలి. టీవీకి వెనుకవైపుఎత్తుగా లైటు ఏర్పాటు చేసుకోవడం మంచిది.



కంటికి వ్యాయామం..

శ్రమ తగ్గించి నరాలు, కండరాలు దెబ్బతినకుండా కంటి వ్యాయామాలు చేసుకోవాలి. తలను బాగా విశ్రాంతిగా ఉంచి చూపును కుడి నుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి పూర్తి చివరలకు తిప్పాలి. కనుగుడ్లు రెండు పక్కలకు తిప్పాలి. తలను ఏమాత్రం కదల్చకుండా వీలైనంత పైకి, కిందకు చూడాలి.

మూఢనమ్మకాలకు పోవద్దు..: డాక్టర్ కె మురళీకృష్ణ, కంటి వైద్యుడు



కంటి సమస్యలు వచ్చినప్పుడు మూఢ నమ్మకాలకు పోవద్దు. ఆకు పసర్లు, నాటు వైద్యం వల్ల ఇన్‌ఫెక్షన్‌లు పెరిగి చూపు పోయే ప్రమా దం ఉంది. కళ్లలో ఏదైనా పడి నపుడు ఎరుపులు వస్తే చనుబాలు పోస్తుంటారు. అలాచేయవద్దు పాలలో చక్కెర శాతం ఉంటుంది. దానివల్ల ఇబ్బందులు ఏర్పడుతాయి. ఈ మధ్య సీతాఫలాల గింజలను నూరి కళ్లలో వేసుకున్న కేసులు వచ్చాయి. ఇది అత్యంత ప్రమాదకరం. చదివిన తరువాత తలనొప్పి వస్తే, మామూలు కాంతిని చూడగానే కళ్లు మూసుకుపోవడం, నొప్పి రావడం, కంటిలోంచి నీరు అదేపనిగా కారడం ఇతరత్రా సమస్యలు ఏర్పడితే కంటి పరీక్షలు చేయించుకోవడం మంచిది.

కంప్యూటర్‌పై పని చేస్తున్నప్పుడు..

కంప్యూటర్ తెరమీద మధ్య భాగానికి పైన మీ చూపు ఉండడం మంచిది. రెప్ప వేయకుండా పని చేయడం మంచిది కాదు. తరచూ రెప్ప వేయాలి. నిరంతరం పని చేయకుండా మధ్యలో విరామం తీసుకోవాలి. కాళ్లు నేలపై ఆనించి వెన్నెముకను నిటారుగా ఉంచి కూర్చోవాలి. కీబోర్డు, మౌస్‌లను సమాన స్థాయిలో ఉంచాలి. శరీరానికి దగ్గరగా ఉండాలి. టైప్ చేస్తున్నప్పుడు ముంజేతి భాగం కీబోర్డుపై ఉంచవద్దు. కాంతివంతంగా కనిపించేలాగా మానిటర్ లైటింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.



డ్రైవింగ్ చేస్తున్నప్పుడు..

వాహనాలు నడుపుతున్నప్పుడు కళ్లజోడు వాడాలి. సూర్యుని నుంచి వచ్చే యూవీ కిరణాల తాకిడితో కళ్లకు హానీ కలగకుండా, దుమ్ము, ధూళీ పడకుం డా రక్షణగా కళ్లజోడు ఉపయోగపడుతుంది. యూవీ కిరణాల నుంచి కాపాడలేని ముదురు రంగుల్లో ఉన్న కళ్లద్దాలు కంటికి రక్షణ ఇవ్వవు. రాత్రులు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు యాంటీగ్లేర్ అద్దాలు వాడాలి. వాహనాల హెడ్‌లైట్లు కాంతిస్థాయిని తగ్గించి కళ్లకు శ్రమ కలుగకుండా చూస్తాయి.



ధర్మపురిలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ యమధర్మరాజు ఆలయంలో మంగళవారం స్వామివారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేద పండితులు బొజ్జ సంతోష్‌కుమార్, బొజ్జ సంపత్‌కుమార్ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్య సూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామివారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, ఒద్దిపర్తి కళ్యాణ్‌కుమార్ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్, అర్చకులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

- వేలాదిగా దీక్షలు స్వీకరణ



దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు. సుమారు పదిహేను వేలకుపైగా స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్ చిన్న జయంతి సమీపిస్తుండడంతో వేలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధిలో దీక్షలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

కొండగట్టులో నత్తనడకన చలువ పందిళ్ల ఏర్పాటు



కొండగట్టు ఆలయం వెనక ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

మల్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో ప్రతి ఏటా వేసవిలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసే చలువ పందిళ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆలయం ముందు, వెనుకాల, దేవస్థానం కార్యాలయం, తదితర ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తుండగా పది రోజులుగా పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ఆలయం ముందు పూర్తి కాగా ఆలయ వెనుక వైపు, కార్యాలయం ప్రాంతంలో ఇంకా వేయాల్సి ఉంది. హనుమాన్ జయంతి నేపథ్యంలో భక్తుల క్రమంగా పెరుగుతుండగా ఎండలతో నీడకోసం భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

నెమలి వాహనంపై స్వామివారి ఊరేగింపు..



స్వామివారల ఊరేగింపు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ రామ ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం స్వామివారి ఊరేగింపును నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను నెమలి వాహనంపై ఊరేగించారు. శ్రవణ్‌కుమార్, సూపరింటెండెంట్ వరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో రద్దీ..

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి వారి అనుబంధ బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెల కొంది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తు లతో అమ్మవారి ఆలయ క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి. అమ్మవారికి పట్నాలు వేసి ఒడి బియ్యం సమర్పించారు.

హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ ఆలయంలో నిర్వహించే హనుమాన్ జయంతి వాల్‌పోస్టర్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ నెల 12వ తేదీన హనుమాన్ జయంతిని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్ ఉన్నారు.

ప్రజాపాలన ప్రభుత్వానికి అడ్డంకులు సృష్టించే ప్రయత్నం..

- భూముల పేరుతో విద్యార్థులను రెచ్చగొడుతున్నారు..
- అభ్రదతా భావాన్ని సృష్టించడంలో బండి సంజయ్ డాక్టరేట్..
- బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిందని, ముళ్ల కంచెలు తొలగించి, ఇందిరా పార్కు, ధర్నాచౌక్‌ను తెరిపించి ప్రజాస్వామిక పరిపాలన కొనసాగిస్తున్నామని, అయినా బీఆర్‌ఎస్ బీజేపీ ప్రజాపాలన ప్రభుత్వానికి అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా తెలంగాణ ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ స్థలాలు గుంజుకున్నట్లు ఆరోపిస్తూ విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చేస్తున్నారన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ స్థలాలను గుంజుకున్నట్లు ఆరోపణలు చేస్తున్నారన్నారు. 2004లో పంచనామా చేసి 400 ఎకరాలకు యూనివర్సిటీకి సంబంధం లేదని, గోపనపల్లిలో ఆల్టర్నేటివ్ ల్యాండ్ తీసుకున్నారన్నారు. 20 సంవత్సరాల క్రితం యూనివర్సిటీ, ప్రభుత్వానికి మధ్య భూ బదలాయింపు జరిగిందన్నారు. అకారణంగా భూమిని ప్రభుత్వం అమ్ముకుంటోందని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కంచె, గోపనపల్లి గ్రామాల పరిసరాలు 132 ఎకరాలు ఎన్‌జీవోలకు కేటాయించారన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పది సంవత్సరాలు అధికారంలో ఉండి కోర్టులో కేసులు నడుస్తుంటే యూనివర్సిటీకి సంబంధించిన అధికారులు కూడా స్థలం తమది అని న్యాయ పోరాటంలో భాగస్వామ్యం తీసుకోలేదన్నారు. 2004 నుంచి న్యాయబద్ధమైన పోరాటం ప్రభుత్వం చేస్తోందని అన్నారు. ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉన్నా అన్యాక్రాంతం కాకుండా ఉండడానికి ప్రభుత్వం లీగల్‌గా ముందుకు వెళ్లడంతో 400 ఎకరాలు వచ్చిందన్నారు. 400 ఎకరాలు కోర్టు ద్వారా ప్రభుత్వానికి వచ్చిందని యూనివర్సిటీకి భూమికి సంబంధం లేదన్నారు. కేసీఆర్‌తో ప్రతిపాదించిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్‌ఫ్యూజన్ కాంట్రవర్సీతో లాభం పొందాలని చూస్తున్నారన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీఆర్‌ఎస్ పార్టీ ఒకే గొంతుగా, తానాతందానా అంటున్నారని అన్నారు. విద్యార్థులను రెచ్చగొడుతూ ప్రభుత్వం తప్పు చేస్తోందని అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని అన్నారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యాపరంగా అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. వైస్‌ఛాన్స్‌లర్ నియామకాల నుంచి ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలు, మౌలిక సదుపాయలు అన్ని రకాలుగా ఏర్పాటుచేసి విద్యా వ్యవస్థలో మార్పులు తెస్తుందని అన్నారు. నిర్లక్ష్యానికి గురైన ప్రైవేటు యూనివర్సిటీలు తెచ్చిన బీఆర్‌ఎస్, వారికి వత్తాసు పలికిన రెండు పార్టీలు ఆడుతున్న నాటకమన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్ని వందల ఎకరాలు అమ్మారో చెప్పాలని అన్నారు. ఎయిర్ ఇండియా, బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌పోర్టు, సింగరేణి గనులు, ఎల్‌ఐసీ, రైల్వేలైన్‌లు అమ్మి వేశారని అన్నారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీ పేరుమీద అమ్మేసిన మీరు మాట్లాడుతున్నారా అంటూ ప్రశ్నించారు. బండి సంజయ్ అప్రకటిత అభద్రతా భావాన్ని సృష్టించడంలో డాక్టరేట్ అని అన్నారు. మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి యూనివర్సిటీలు ఇచ్చా రని, తాము కొత్త యూని వర్సిటీలు పెడుతున్నామని చాకలి ఐలమ్మ మహిళ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూని వర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలు తీసుకవస్తున్నామని అన్నారు. ఐటీ రంగానికి తలమానికంగా మారుతుందని అన్నారు.

భూముల వ్యవహారాల్లో అసలు ఎజెండా రహస్యం ఇక్కడ పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే బీఆర్‌ఎస్ నాయకులు రాజ పుష్ప, మైహోం రామేశ్వర్‌రావులు ఐలాండ్‌లు కట్టింది అమ్ముకోవడానికి ఇబ్బందులు అవుతాయని, ఇద్దరు ప్రముఖ బిల్డర్‌లు రియల్ ఎస్టేట్‌ను కాపాడుకోవడానికి హిడెన్ ఎజెండా బీఆర్‌ఎస్, బీజేపీ చేస్తుందని అన్నారు. అక్కడ ఎలాంటి జింకలు చనిపోలేద ని అబద్ధాలు, దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. భూములు అమ్మి ప్రభుత్వం దోపిడీ చేస్తోందని చెబుతున్నారని, గతంలో కోకాపేటలాంటి స్థలాల్లో ఇష్టారీతిన వ్యవహరించారని, కిషన్‌రెడ్డి, కేటీఆర్, బండి సంజయ్ వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. దేశంలోనే రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రథమమని అన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలను అమలు చేస్తోందని అన్నారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు వనిత, నాయకులు వైద్య శివప్రసాద్, కొండ శ్రీనివాస్, గోలి వెంకటరమణ, మడుపు శ్రీదేవి పాల్గొన్నారు.

ఎండిన గోదావరి.. పైప్‌లైన్ల లీకేజీ

సింగరేణి కార్మికుల కాలనీలకు ఇబ్బందులు



పారిశ్రామిక ప్రాంతానికి నీటి సరఫరా చేసే ఫిల్టర్ బెడ్

రామగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ పారిశ్రామిక ప్రాంతంలోని కార్మిక కుటుంబాలు నీటి సమస్యతో సతమతమవుతున్నాయి. కాలనీలకు కనీస తాగు నీటి వసతి కల్పించకపోవడంతో కార్మికులు అసహనానికి గురవుతున్నారు. రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారు. నీటి సరఫరాలో సరైన సమయపాలన లేని కారణంగా కార్మికులు విధులకు సైతం గైర్హాజరు అయ్యే పరిస్థితి నెలకొంది. నిత్యం గోదావరి నుంచి 12 గంటలపాటు నిరంతరంగా నీటి సరఫరా జరగాల్సి ఉండగా కేవలం 4నుంచి 6 గంటలు మాత్రమే సెంటినరీకాలనీ ఫిల్టర్ బెడ్‌కు గోదావరి నీటి సరఫరా చేపడుతున్నారు. ఫిల్టర్ బెడ్ నిండిన అనంతరం కార్మికులకు టుంబాలకు నీటి సరఫరా చేస్తారు. గోదావరి నుంచి అయ్యే నీటి సరఫరా నాలుగు గంటలు మించడం లేదని తెలిసింది. కార్మికుల నివాసాలకు గంటపాటు విడుదల చేసే నీటి సరఫరాలో పదిహేను నిమిషాల పాటు కలుషిత నీటి సరఫరానే జరుగుతున్నట్లు కార్మిక కుటుంబాలు వాపోతున్నాయి. గోదావరి నీటికి ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక ప్రాంతానికి ఎంసీసీ నీటి వినియోగంలోకి తెచ్చారు. కాని మోటార్‌ల నుంచి వచ్చే నీటి సరఫరా తాకిడికి పైప్‌లైన్ పగిలి మరమ్మతులకే కాలం గడిచి పోతోంది. మార్చిలోనే తాగు నీటి కష్టాలు ఉంటే ఇక మే నెలలో మరింత నీటి ఎద్దడి ఉంటుందని కార్మికులు పేర్కొం టున్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.



సెంటినరీకాలనీలోని వాటర్ ట్యాంకు

నీరు అందక విధులకు గైర్హాజరు

మోల్మూమూరి శ్రీనివాస్



పారిశ్రామిక ప్రాంతంలో తాగు నీటి సరఫరా లేని కారణంగా కార్మికులు విధులకు గైర్హాజరు అవుతున్నారు. కార్మికులకు కనీస మౌలిక వసతులు అందించడంలో సింగరేణి విఫలమైంది. అధికారులు చొరవ చూపాలి

నిత్యం నీటి సరఫరా చేపట్టాలి

బూర్గరాజుగౌడ్



కార్మికుల నివాసాలకు రోజు విడిచి రోజు కాకుండా రోజు నీటి సరఫరా చేయాలి. నీటి కోసం కార్మికులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. నీరు విడుదల చేసేలా సింగరేణి యాజమాన్యం స్పందించాలి.

రేణుక ఎల్లమ్మ విగ్రహావిష్కరణలో పాల్గొనండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేరుగు హన్మంతుగౌడ్

గోదావరిఖని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని సబ్బండ వర్గాలు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు హన్మంతుగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి ఈ నెల 4వరకు రేణుకమాత సహిత పరివార దేవతల ప్రతిష్ఠాపన ఉంటుందని, గణపతి పూజతో ప్రారంభమై ఉత్సవ మూర్తి విగ్రహాల ఊరేగింపు ఉంటుందని, మార్కండేయకాలనీ శివాలయం నుంచి దేవతా మూర్తులను ప్రతిష్ఠించడం జరుగుతుందని, శిఖర ప్రతిష్ఠాపన, శాంతి హోమాలు, బలిదానం, పూర్ణహుతి, కుంబాభిషేకం, హారతి, మంత్ర పుష్పాలు ఉంటాయని, సామూహిక హోమాలు కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 20 నుంచి పోచమ్మ బోనాలు, రేణుక ఎల్లమ్మ, కళ్యాణ మహోత్సవం, బోనాలు ఉంటాయని, ఇందులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. నాయకులు వంగ శ్రీనివాస్, బాలసాని స్వామిగౌడ్, బొల్లం సురేష్, కోట రవి, మేరుగు యాదగిరి, మోడెం సురేందర్, మండ రమేష్, కోడూరి రవి, జనార్ధన్(లడ్డు), సిరిశెట్టి తిరుపతి, గున్నాల శ్రీధర్, బెంద్రం నాగభూషణం, పొన్నం అంజయ్య, బాబు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చేతిపంపు



గుడిపెల్లిలో మూలనపడిన చేతి పంపు

పాలకుర్తి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వాలు చేతి పంపులు ఏర్పాటు చేశాయి. వీటి ద్వారా ప్రజలకు కొంత వరకు నీటి సమస్య తీరేంది. వాటికి మరమ్మతు చేసేందుకు ప్రత్యేకంగా కొందరికి శిక్షణ ఇచ్చి మండలానికి ఒకరు చొప్పున విధుల్లోకి తీసుకున్నారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో చెడిపోయిన చేతి పంపులు మరమ్మతుకు నోచుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుడిపెల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, సమీపంలో ఉన్న బస్టాండ్‌లో వేచి ఉండే ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చేతి పంపు మట్టిలో కూరుకు పోయింది. చేతిపంపు చెడిపోయి రెండు సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోక నిరుపయోగంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు చేతిపంపులను బాగు చేసి వేసవిలో ప్రజలకు తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు, వ్యాపారులు ముందుకు రావాలని సీఐ సుబ్బారెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం సీఐ, ఆర్టీసీ అధికారి రామ్‌గోపాల్ రెడ్డితో కలసి ప్రారంభించారు. సీఐ మాట్లాడుతు ఎండలు మండుతున్న నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజానీకానికి చల్లని నీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్, వల్స నీలయ్య, శ్రీనివాస్, పెరుమాండ్ల హర్ష చక్రవర్తి, వెంకటేశం, దావల్ల నరేందర్, సాంబమూర్తి, దూడం ప్రకాష్, ఆర్టీసీ ఉద్యోగులు వంగల అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెలలో నిరంతర అఖండ నామస్మరణ



ఓదెల రామాలయంలో అఖండ నామస్మరణను చేస్తున్న భక్తులు

ఓదెల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు అఖండనామ స్మరణ నిర్వహించారు. రాత్రింబవళ్లు ఆరు బృందాలుగా ఏర్పడి, ఒక్క బృందం రెండు గంటల చొప్పున రామస్మరణ నిర్వహిస్తున్నారు. ఈ విధంగా 24 గంటలపాటు నిర్వహిస్తూ 6న శ్రీరామనవమి వేడుకల రోజున పూర్తి చేయనున్నారు. యేటా అఖండనామస్మరణ నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుంది.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 50డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. డివిజన్లలో గడపగడపకు తిరుగుతూ సమస్యలను నోట్ చేసుకుని పరిష్కారానికి ఫోన్ నెంబర్లు కూడా సేకరించి డాటాను తయారు చేయాలన్నారు. జైభీమ్, జై బాపు, జై సమిధాన్ అనే నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

5న పుట్ట నారాయణ వర్ధంతి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం ముస్యాల గ్రామానికి చెందిన పుట్ట నారాయణ వర్ధంతిని గోదావరిఖని మార్కండేయ కాలనీలో ఈనెల 5న నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వర్ధంతి కరపత్రాలను విడుదల చేశారు.గోదావరిఖనిలో జరిగిన బంద్ సందర్భంగా పోలీసుల కాల్పుల్లో సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ బలయ్యాడు. మాదన కుమార స్వామి, శ్రీపతి రాజగోపాల్, రాజయ్య, లక్ష్మన్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు తప్పనున్న చిల్లర తిప్పలు

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు పడుతున్నారు. టిక్కెట్ వెనుకాల చిల్లర డబ్బులు రాస్తున్నారు. ప్రయాణికులకు కూడా అసౌకర్యంగా మారడాన్ని గమనించిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారులు నగదు రహిత సేవలను ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సర్వీసులకు విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు ఈ-టిమ్‌లను ఆర్టీసీ ఉన్నతాధికారులు అన్ని డిపోలకు సరఫరా చేశారు. కొత్త టిమ్‌ల ద్వారా కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని లగ్జరీ బస్సుల డ్రైవర్లు తెలిపారు. బస్సులో గల సీట్ల వరకు టిక్కెట్లు ఇచ్చిన తర్వాత అంతకు మించి అదనంగా ఒక్కరు ఎక్కినా కూడా టిక్కెట్ రావడం లేదని చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్‌లో సీటింగ్ లాకింగ్ ఏర్పాటు చేయడం వల్ల సమస్య తలెత్తుతున్నదని చెబుతున్నారు. అలాగే పాత యంత్రాల్లో ఉన్నట్లుగా ఈ యంత్రాల్లో రాయితీ సేవలు, ఉచిత ప్రయాణ సేవలు అన్ని ఉన్నాయని చెబుతున్నారు. ఈ నెలాఖరుకల్లా అన్ని సర్వీసుల్లో నగదు రహిత సేవలు అందుబాటులోకి రానున్నాయి.

బ్రాస్‌బ్యాండ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కాల్వశ్రీరాంపూర్/ధర్మారం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బ్రాస్ బ్యాండ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఇనుగాల రాజయ్య అన్నారు. బ్రాస్‌బ్యాండ్ వర్కర్ల మహాసభలు సుల్తానాబాద్‌లో ఈనెల 8న జరుగనున్న సందర్భంగా మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించారు. బ్యాండ్ వృత్తిదారులను ప్రభుత్వం కళాకారులుగా గుర్తించాలని, బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. 50సంవత్సరాలు నిండిన వర్కర్లకు పెన్షన్ ఇవ్వాలని, సబ్సిడీపై ప్రభుత్వం రుణం ఇవ్వాలన్నారు. ఎండి.సాహెబ్ హుస్సేన్, బాసమియా, కన్నూరి రాజయ్య, పాల ఎల్లయ్య పాల్గొన్నారు. ధర్మారం మండల అధ్యక్షుడు ఏదుల్ల అంజయ్య, మల్లయ్య, మోహన్‌నాయక్, స్వామి, నర్సానాయక్, పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



గెలుపొందిన జట్టుతో నిర్వాహకులు

కమాన్‌పూర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం హర్షణీయమని మాజీ ఎంపీపీ మల్యాల రామ్‌చంద్రగౌడ్, డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి సుభాష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. రెండురోజులుగా కొనసాగిన టోర్నమెంట్‌లో పదిజట్లు పాల్గొన్నాయి. పాలకుర్తి మండలం భామల నాయక్ తండా జట్టు గెలుపొందగా రన్నర్‌గా పేరపల్లి జట్టు నిలిచింది. విన్నర్ జట్టుకు మాజీ ఎంపీపీ పోలేటి మారుతి రూ.ఐదే వేలు, రన్నర్ జట్టుకు కాంగ్రెస్ నాయకుడు రంగ్ సత్యంగౌడ్ రూ.మూడు వేలు అందజేశారు. సెమీఫైనల్‌లో ఓడిపోయిన రెండు జట్లకు రూ.రెండు వేల చొప్పున, ఉత్తమ క్రీడాకారులకు రూ.500చొప్పున మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి అందజేశారు. సీనియర్ వాలీబాల్ ఆటగాడు నల్లవెల్లి శంకర్, అలవెన లక్ష్మీరాజం, మచ్చగిరి రాము, తిరుపతి, సుభాష్ యూత్ అధ్యక్షుడు చీదురాల అజయ్, పంజా సాయిరాంగౌడ్, పల్లె అనుదీప్‌గౌడ్, నరేష్, పెండ్యాల అమరేశ్వర్, ప్రవీణ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన యోగా గురువు అల్లం రాజు కుటుంబానికి గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం స్థానిక స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో యోగా, వాకర్స్ మిత్రులు సేకరించిన రూ.26,500లను మాజీ కార్పొరేటర్ మహంకాళిస్వామి, పాత్రికేయులు దయానంద్‌గాంధీ చేతుల మీదుగా మృతుడి భార్యకు అందజేశారు. కన్వీనర్ దాసరి రఘు, శ్రీనివాస్, సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం

స్కూల్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు జె.సురేందర్‌ను వాకర్స్ అసోసియేషన్ సత్కరించింది. స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో సురేందర్‌ను కాంగ్రెస్ మాజీ ఫ్లోర్‌లీడర్ మహంకాళిస్వామి, పాత్రికేయుడు దయానంద్‌గాంధీ సన్మానించారు. స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా సురేందర్ అందించిన సేవలను కొనియాడారు.

ఘనంగా ప్రభుత్వ విప్ అడ్లూరి పుట్టినరోజు



ధర్మారంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ధర్మారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. పుట్టిన రోజు సందర్భంగా మిని గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు కాడె సూర్య నారాయణ, రవీందర్ రెడ్డి, దేవి జనార్దన్, కొత్త నర్సింహులు, బొల్లి స్వామి, ఒడ్నాల శంకరయ్య రాజేశంగౌడ్, పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ కరుణాకర్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని, సెటిల్‌మెంట్లలో జోక్యం చేసుకోవద్దన్నారు. క్రిమినల్ కేసుల్లో పాల్గొన్న, ప్రోత్సహించిన కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. సివిల్ పంచాయితీల్లో తల దూర్చవద్దని సూచించారు. సత్ప్రవర్తనగా ఉన్నప్పుడే రౌడీషీట్లు ఎత్తి వేస్తామన్నారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ. ప్రవీణ్ కుమార్, ఎస్సైలు, లక్ష్మణ్‌రావు, మల్లేశం, లక్ష్మణ్, స్వామి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలులో రికార్డు



ధర్మారంలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

ధర్మారం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలంలో ఇంటి పన్ను రికార్డు స్థాయిలో వసూలైంది. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, ఖాళీ స్థలాల పన్ను మినహాయించగా మిగతా వంద శాతం అధికారులు పన్ను వసూలు చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సిబ్బంది పన్ను వసూల్‌లో భాగస్వాములు అయ్యారు. మండల వ్యాప్తంగా రూ.72,56763 పన్ను వసూల్ చేయగా అందులో ధర్మారం గ్రామ పంచాయతీకి చెందిన రూ.25 లక్షల పైచిలుకు ఉన్నాయి. ధర్మారం మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉండగా 16,606 ఇండ్లు ఉన్నాయి. ధర్మారం గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కువ కమర్షియల్ బిల్డింగులు ఉండడం వల్ల అధికంగా ఇంటి పన్ను వసూలైందని ఎంపీఓ రమేష్ తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే
-కోలపూరి రమేష్. ఎంపీవో

ఈ ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను వసూల్ చేయడంలో ప్రజలు సహకరించారు. మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల సిబ్బంది పన్ను వసూలు చేశారు. ఇంటి పన్ను చెల్లించడం ఇంటి యజమానులకే మంచిది. వారి ఇంటిపై వారికి సర్వహక్కులు కలిగి ఉండమే కాకుండా ప్రభుత్వంతో భాగస్వాములవుతారు.

లక్ష్య సాధనలో వెనుకబడిన సింగరేణి

- వార్షిక లక్ష్యంలో 96శాతమే ఉత్పత్తి
- మందమర్రి, భూపాలపల్లి డివిజన్లలో 80శాతం లోపే ...

గోదావరిఖని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యం చేరుకోలేకపోయింది. నిర్దేశించిన లక్ష్యానికి లక్ష టన్నులు తక్కువ ఉత్పత్తి జరిగింది. 72మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 69 మిలియన్ టన్నులు(96శాతం) మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరిగింది. అండర్ గ్రౌండ్ గనుల్లో 6.1మిలియన్ టన్నులకు గాను 4.8మిలియన్ టన్నులు(78.8శాతం), ఓపెన్‌కాస్టుల్లో 65.9 మిలియన్ టన్నులకుగాను 64.1(97.4)శాతం ఉత్పత్తి జరిగింది. సంస్థలోని ఇల్లందు, మణుగూరు, ఆర్జీ-1, ఆర్జీ-3 డివిజన్లు మాత్రమే లక్ష్యాన్ని చేరుకున్నాయి. మందమర్రిలో 78శాతం, భూపాలపల్లిలో 75శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరిగింది. సింగరేణిలో మెగాప్రాజెక్టు అయిన ఓపెన్ కాస్టు-3 ఉన్న ఆర్జీ-2లో సైతం 99శాతం, కొత్తగూడెంలో 14.95మిలియన్ టన్నులకు గాను 14.41మిలియన్ టన్నులు, ఇల్లందులో 4.1 మిలియన్ టన్నులకు గాను 4.2 మిలియన్ టన్నులు, మణుగూరు 12.7మిలియన్ టన్నులు, బెల్లంపల్లి ఏరియాలో 3.85మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 3.75 మిలియన్ టన్నులు, మందమర్రి డివిజన్‌లో 3.46మిలియన్ టన్నులకుగాను 2.71మిలియన్ టన్నులు(78శాతం), శ్రీరాంపూర్‌లో 6.31గాను 5.78 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. ఆర్జీ-1లో 4.94మిలియన్ టన్నులతో ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించగా ఆర్జీ-3కూడా 6.25మిలియన్ టన్నులకు గాను 6.5మిలియన్ టన్నులు సాధించి ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. మెగామైన్ ఓసీపీ-3 ప్రాజెక్టు 9.87మిలియన్ టన్నులకు గాను 9.7మిలియన్ టన్నులను సాధించింది. అడ్రియాల ప్రాజెక్టు ఉత్పత్తి లక్ష్యానికి దూరంగా ఉంది. 5.2లక్షల టన్నులకు గాను 4.09లక్షల టన్నులు సాధించింది. ఇక భూపాలపల్లి ఏరియా 4.96మిలియన్ టన్నులకు గాను 3.7మిలియన్ టన్నులు(76శాతం) మాత్రమే ఉత్పత్తి సాధించింది.

ఓసీపీ-3 ఉద్యోగులను అభినందించిన జీఎం



ఉద్యోగులను సన్మానిస్తున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేసిన ఓసీపీ-3 ఉద్యోగులను జీఎం బండి వెంకటయ్య అభినందించారు. మంగళవారం కృషిభవన్‌లో ఉద్యోగులతో జీఎం సమావేశమయ్యారు. ఏప్రిల్ చివరి రోజైన 30న అత్యధిక ట్రిప్పులు కొట్టిన డంపర్ ఆపరేటర్లు, షావల్ ఆపరేటర్లను అభినందించారు. రికార్డు స్థాయిలో 1,21,365 క్యూబిక్ మీటర్ల ఓబీ, 51,111 టన్నుల బొగ్గు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. 2025-26 వార్షిక లక్ష్యాన్ని సాధించేలా ఓసీపీ-3 ఉద్యోగులు కలిసికట్టుగా పని చేయాలన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ...

ఓసీపీ-3 ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీని అధికారులు ప్రారంభించారు. ఉద్యోగులు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేనేజర్ భరత్‌కుమార్ సూచించారు. ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ మహేందర్, డీవైపీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన ఆర్‌జీ-1



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించిందని జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. 49.4లక్షల టన్నుల లక్ష్యానికిగాను 49.64లక్షల టన్నుల ఉత్పత్తి సాధించామన్నారు. ఒక్క జీడీకే-5 ఓసీలోనే 39.93లక్షల టన్నుల ఉత్పత్తి జరిగిందన్నారు. ఈ ఏడాది ఆర్‌జీ-1 నుంచి 43 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందని, రోజుకు మూడు నుంచి 5 రేక్‌ల రవాణా జరిగినట్టు ఆయన పేర్కొన్నారు. ఐదేళ్లలో రికార్డు స్థాయిలో 1097రేక్‌లు సీఎస్‌పీ ద్వారా రవాణా జరిగిందన్నారు. జీడీకే 11ఇంక్లైన్‌లో 86శాతం ఉత్పత్తి జరిగిందన్నారు. జీడీకే 1, 3, 2, 2ఏకు సంంధించి ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి జనగామ చెరువు కింద జరుగుతుందని, సాండ్ స్టోవింగ్ జరగనిదే ఉత్పత్తి చేసే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికే జైపూర్ విద్యుత్ కేంద్రంతో పాటు ఎన్‌టీపీసీ నుంచి బూడిద అలాట్ అయ్యిందని, ప్రత్యామ్నాయంగా జనగామ వద్ద నుంచి గోదావరి ఇసుకను తీసుకుంటామన్నారు. ఈ ఏడాది వార్షిక లక్ష్యాన్ని కుదించారని, 45లక్షల టన్నులుగా నిర్దేశించారన్నారు. ఆర్‌జీ-1లో ఓసీపీ-5 400 కోట్ల లాభాలను ఆర్జించిందని, అదే సమయంలో అండర్ గ్రౌండ్ గనులు రూ.200కోట్లు నష్టాల్లో ఉన్నాయన్నారు. సరాసరి ఆర్‌జీ-1 రూ.200కోట్ల లాభాల్లో ఉండే అవకాశం ఉందని జీఎం పేర్కొన్నారు. మేడిపల్లి ఓపెన్‌కాస్టులో సంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్ డీపీఆర్ తయారు చేసేందుకు టాటా కన్సల్టెంట్ సంస్థకు పనులు అప్పగించారన్నారు. కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందని, దీనిలో భాగంగా రూ.15కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్, 23కిలో మీటర్ల అంతర్గత రహదారులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, మరో 534క్వార్టర్ల నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు మేడిపల్లి ఓసీపీ నుంచి ర్యాపిడ్ ఫిల్టర్ బెడ్ వరకు ప్రత్యేక పైప్ లైన్ వేస్తున్నామన్నారు. జీడీకే 1సీఎస్‌పీలో ఒక కాంట్రాక్టర్ ఇబ్బంది పెట్టడం వల్ల వాటర్ స్ప్రేయర్లు పని చేయడం లేదని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబు, ఓసీపీ-5 పీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆర్జీ-2 ఏరియా వార్షిక ఉత్పత్తి 99 శాతం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్జీ-2 ఏరియా 99శాతం ఉత్పత్తి సాధించినట్టు జీఎం బండి వెంకటయ్య తెలిపారు. మంగళవారం జీఎం ఛాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏడాది ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 98,70,000 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా 97,77,937 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి(99శాతం) జరిగినట్టు జీఎం తెలిపారు. ఓబీ వార్షిక లక్ష్యం 6.03 మిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా 4.55 మిలియన్ క్యూబిక్ మీటర్లు(76శాతం) వెలికితీసినట్టు జీఎం పేర్కొన్నారు. సీహెచ్‌పీ ద్వారా 86,73,922 టన్నుల బొగ్గు రవాణా చేసినట్టు జీఎం తెలిపారు. ఓసీపీ-3 వార్షిక లక్ష్యం 95.20లక్షలకుగాను 94.38 లక్షల టన్నుల బొగ్గు(99శాతం) జరిగినట్టు జీఎం వెంకటయ్య పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశిత వార్షిక లక్ష్యం 98.77 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించే దిశగా ఉద్యోగులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్ నరసింహారావు, అఫీషియేటింగ్ పీఓ, ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అధికారులు ఎర్రన్న, మురళీకృష్ణ, ధనుంజయ, వెంకటరామచంద్ర, పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో ప్రత్యేక పూజలు

రామగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో మంగళవారం ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భవిష్యత్ ఉత్పత్తి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ప్రార్థిస్తూ జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్‌అండ్ అకౌంట్స్ విభాగంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఏజీఎం శ్రీనివాస్‌లు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న ఎస్‌వోటూ జీఎంకు సన్మానం

రామగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఎస్‌వోటూజీఎం పనిచేస్తూ కార్పొరేట్ హెచ్‌ఆర్‌డి విభాగానికి జనరల్ మేనేజర్‌గా పదోన్నతిపై వెళుతున్న గుంజపడుగు రఘుపతిని మంగళవారం ఏపీఏ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం నాగేశ్వర్‌రావు సన్మానించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో అధికారులు శ్రీనివాసులు, సుధాకర్, నారాయణ, కోలశ్రీనివాస్, ఏఐటియుసి నాయకులు వై.వీరావు, ఎంఆర్‌సిరెడ్డి, గంగాధర్, సంపత్‌లు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే లక్ష్యాల సాధన

- ఆర్జీ-3లో 104, ఏపిఏలో79 శాతం

రామగిరి, ఏప్రిల్ 1: సమష్టి కృషితోనే వార్షిక ఉత్పత్తిని అధిగమించామని ఆర్జీ-3, ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావు మంగళవారం సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్జీ-3 డివిజన్‌కు నిర్దేశించిన 62.50 లక్షల టన్నులకుగాను 65.11 లక్షల టన్నులు సాధించి 104 శాతంలో నిలిచిందన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటుగా 500.90 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీశామన్నారు. ఆర్థిక సంవత్సరంలో 78.11 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామని పేర్కొన్నారు. ఆర్జీ-3 డివిజన్‌లో మాసాంతానికి సంబంధించి నిర్దేశించిన 6.08 లక్షల టన్నులకుగాను 9.54 లక్షల టన్నులు సాధించి 157 శాతంలో నిలిచిందన్నారు. ఓసిపి-1 నిర్ధేశించిన 3.28 లక్షల టన్నుల లక్ష్యానికి 5.79 లక్షల టన్నులు సాధించి 177 శాతం, ఓసిపి-2 ప్రాజెక్టు నిర్ధేశించిన 2.80లక్షల టన్నుల లక్ష్యానికి 3.75లక్షలు టన్నులు సాధించి 134శాతంలో నిలిచిందన్నారు. ఏపిఏ డివిజన్‌లో ఆర్థిక సంవత్సరానికి నిర్ధేశించిన 5.20 లక్షల టన్నుల లక్ష్యానికి 4.10 లక్ష్యాన్ని సాధించి 79శాతంలో నిలిచిందన్నారు. ఏపిఏ డివిజన్‌లో మాసంతపు ఉత్పత్తిలో నిర్ధేశించిన 1.28 లక్షల టన్నుల లక్ష్యానికి 0.15 లక్షల టన్నులు సాధించి 12శాతం వెలికితీసిందన్నారు.

సీఎంవోగా పదోన్నతి పొందిన అధికారికి సన్మానం



కిరణ్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న జీఎం, అధికారులు

గోదావరిఖని, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన డా.కిరణ్ రాజ్‌కుమార్‌ను మంగళవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో జీఎం లలిత్‌కుమార్, అధికారులు సన్మానించారు. కిరణ్ కుమార్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందడం గొప్ప అవకాశమన్నారు. అదే విధంగా మేనేజర్ రమేష్ పదోన్నతిపై వెళుతున్న సందర్భంగా వారిని సన్మానించారు ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, పీఓ చంద్రశేఖర్, డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబు, ఏరియా ఇంజనీరు వెంకటేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఏసీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌ను ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సన్మానించారు. ఆసుపత్రి ఆవరణలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మధు, జాతీయ కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీష్, రాజేష్‌లు డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌ను సన్మానించారు.

ఓసీపీ-1 ఉద్యోగులకు స్పెషల్ ఇన్సెంటివ్ ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 ఉద్యోగులకు స్పెషల్ ఇన్సెంటివ్ ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం సైటాఫీస్‌లో జరిగిన మజ్జిగ పంపిణీలో ఆయన మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రాజెక్టుకు కేటాయించిన వార్షిక లక్ష్యాన్ని ప్రోత్సాహకాన్ని అందజేయాలని కోరారు. ప్రతికూల పరిస్థితులు ఉన్నా, పరికరాలు సరిగ్గా లేకున్నా, ఫైర్ సీమ్‌ల నుండి ఎంతో శ్రమకోర్చి బొగ్గు వెలికితీసిన కార్మికులు నిర్దేశిత 35 లక్షల టన్నుల టార్గెట్‌ను సాధించి ఓసీపీ-1 పేరు నిలిపినట్టు తెలిపారు. ఎఓ రాజశేఖర్, అధికారులు కోటయ్య, రమేష్, రఘువ రన్, నాయకులు డీటీ రావు పాల్గొన్నారు.